## ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



ఎదులాపురం : వార్డులో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాన్ని అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి రొకండ్ల రమేశ్, కౌన్సిలర్ బండారి సతీశ్

ఎదులాపురం, నవంబర్ 18 : ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు మద్దతుగా పట్టణంలో జోరుగా ఎన్నికల ప్రచారం సాగుతున్నది. శనివారం జిల్లా కేంద్రంలోని భూక్తాపూర్‌లో వార్డు ఇన్‌చార్జి, రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, నాయకులు సాజిదొద్దీన్, కాళ్ల విఠల్, కోరెడ్డి శంకర్, కస్తాల ప్రేమల, కాలనీవాసులు పాల్గొన్నారు.

### బొక్కలగూడలో..



ఎదులాపురం: బొక్కలగూడలో ఓటు అభ్యర్థిస్తున్న జిల్లా అధికారప్రతినిధి

ఎదులాపురం, నవంబర్ 18 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు మద్దతుగా జిల్లా అధికార ప్రతినిధి, వార్డు ఇన్‌చార్జి బీ గంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ శనివారం జిల్లా కేంద్రంలోని బొక్కలగూడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఓ వృద్ధురాలు కేసీఆర్ సాబ్ .. ఔర్ ఏక్ బార్ సీఎం బంతే (కేసీఆర్ సారు మరోసారి సీఎం అవుతారు ) అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించింది. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏజాజ్, నాయకులు జహీర్, రహీం, సమీర్, మోసిన్ ఖాన్, ముజాఫర్, హబిబ్‌ఖాన్, జామీల్, అప్సర్‌ముల్సాబ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఎదులాపురం, నవంబర్ 18 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రణదీవేనగర్‌కు చెందిన 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పట్టణ మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పర్వీన్ సుల్తానాతో కలిసి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాహితమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా వేలాది మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలు, ఆరోపణలు నమ్మవద్దన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ అధ్యక్షుడు మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ కార్యదర్శి పర్వీన్ ఫేరోజ్, అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతాం

- ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- పలు గ్రామాల్లో గడపగడపకూ ప్రచారం



జైనథ్ : కంఠ గ్రామంలో చేస్తున్న ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

జైనథ్, నవంబర్ 18 : కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతామని ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని కంఠ, ముక్తాపూర్, మాకోడ, పిప్పల్‌గాం, పుసాయి, పిప్పర్‌వాడ, మాండగడ, కమాయి, డొల్లార గ్రామాల్లో రోడ్‌షోల ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామగ్రామాన మహిళలు మంగళ హారతులతో తరలివచ్చి వీరతిలకం దిద్ది ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను పెంచి పేదలపై ఆర్థిక భారాన్ని మోపిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను బీజేపీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. జన్‌ధన్ పేరిట మహిళల బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని వేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఒక్క ఉద్యోగం కూడా బీజేపీ సర్కారు ఇవ్వలేదన్నారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని 1200 ధరను పెంచిన బీజేపీకి ఓటు వేస్తారా, మూడు గంటల కరెంట్ సరిపోతుందన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారా అని ప్రశ్నించారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు లాంటి పథకాలతో నేడు రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరతో ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఓటర్లు గుర్తించి కారు గుర్తును మంచిగా గమనించి ఓటు వేయాలని కోరారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కంఠ గ్రామస్తులు

కంఠ గ్రామానికి చెందిన 50 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారిని గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఎస్ లింగారెడ్డి, నాయకులు యాసం నర్సింగ్‌రావ్, అల్లూరి కల్చాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణు యాదవ్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ శేఖర్, సర్పంచ్‌లు బాలాజీ, దిలీప్, వెంకన్న, సంతోష్ రెడ్డి, పోతారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఓటమి భయంతోనే నీచ రాజకీయాలు

జైనథ్, నవంబర్ 18 : ఓటమి భయంతో నీచ రాజకీయాలకు బీజేపీ నాయకులు దిగజారుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. మండలంలోని ఆడ గ్రామంలోని శివాలయాన్ని సందర్శించుకోవడానికి వెళ్తే బీజేపీ నేతలు అడ్డుకున్నారని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ స్వగ్రామమైన ఆడ గ్రామంలో ఎమ్మెల్యేను కావాలనే కొందరు అడ్డుకోగా పోలీసులు వారిని నిలువరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఆడ గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాయని, తాము ప్రచారం చేయడానికి బీజేపీ ఎందుకు అడ్డు పడుతోందని వారిని ప్రశ్నించారు. గ్రామంలోని శివాలయాన్ని దర్శించుకోవడానికి వెళ్తున్నామని చెప్పి అడ్డుపడడం బీజేపీ నేతల వక్రబుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. కొందరు కావాలని తమ పర్యటనను అడ్డుకున్నంత మాత్రన ఒరిగేదేమి లేదన్నారు. బీజేపీ నేతలు రౌడీల్లాగా వ్యవహరించడం సరికాదని అన్నారు. తమ పర్యటనను అడ్డుకున్న బీజేపీ నేతల విలువనే దిగజారిందని స్పష్టం చేశారు. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును ప్రజలు తమ ఇష్టమైన నేతలకు వేసుకునే అవకాశం ఉందని, ఒత్తిడితో ఆ హక్కును కాలరాసే ప్రయత్నాలు సరికాదని బీజేపీ నేతలను హెచ్చరించారు. ఇకనైనా ఇటువంటి కుటీల రాజకీయ ప్రయత్నాలు మానుకొని ప్రజలకు మంచి చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. సంక్షేమ పాలన అందిస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని స్పష్టం చేశారు. బీజేపీ సంక్షోభ పాలనను ఎంత మాత్రం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను సైతం తప్పకుండా వచ్చే ఏప్రిల్ మాసం నుంచి అమలు చేస్తామని మరోసారి అభివృద్ధికే పట్టం కట్టి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్సెట్టి గోవర్ధన్, పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, లింగారెడ్డి, వేణు గోపాల్ యాదవ్, సంతోష్, ప్రశాంత్ రెడ్డి, భోజన్న, ప్రభాకర్, చంద్రయ్య పాల్గొన్నారు.

## ఛాయ నీకు.. ఓటు కారు గుర్తుకు



టీ చేస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడలో శనివారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ హోటల్లో ఛాయ్ చేస్తూ ఓట్లు అడిగి ఆకట్టుకున్నారు. –ఇచ్చోడ, నవంబర్ 18

## ప్యాకేజీతో కాంగ్రెస్‌లో చేరింది బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఎదులాపురం, నవంబర్ 18 : ప్యాకేజీలతో కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలూరి గోవర్ధన్ రెడ్డికి ఆదిలాబాద్‌లో జరిగిన అభివృద్ధి కనబడడం లేదా? గడిచిన పది సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ సవాల్ విసిరారు. శనివారం జిల్లా కేంద్రంలోని దుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్‌లో జరిగిన అభివృద్ధి విషయంలో సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు అభినందనలు తెలిపిన విషయాన్ని జీర్ణించుకోలేక గోవర్ధన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమాఖ్య పాలనలో అభివృద్ధికి నోచుకొని మన ప్రాంతం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమని, కోట్లాడింది అనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపైన కాదా ప్రశ్నించారు. నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రజల మనిషి ఎమ్మెల్యే జోగు రామన్ననే గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పారాషుట్ లీడర్‌కు అభివృద్ధిపై చర్చకు సిద్ధం అంటూ సవాల్ చేశారు. ఎక్కడికి రమ్మంటారో చెప్పండి మేము సిద్ధమేన్నారు. సమావేశంలో వార్డు నాయకులు అజయ్, దినేశ్, మహేశ్, జయరాం, షాజన్ పాల్గొన్నారు.

## కొత్త ఓటర్ కార్డుల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 18 : ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటోంది. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న యువతీ యువకులతో పాటు చిరునామా, ఫొటో వంటివి మార్పులు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం ముద్రించిన కొత్త గుర్తింపు కార్డులను జారి చేస్తోంది. స్పీడ్ పోస్ట్ ద్వారా కార్డులను ఓటర్లకు పోస్టుమ్యాన్లు పంపిణీ చేస్తున్నారని ఆదిలాబాద్ పోస్టు మాస్టర్ ఉత్తమ్ తెలిపారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 18 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ నంబర్–2 పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి డాక్టర్ పీ శివరామ ప్రసాద్, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ నగేశ్, హెడ్‌మాస్టర్ బచన్‌సింగ్, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు న్యాయ సహాయ సలహాదారులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 18: ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రియ పత్తి పరిశోధనా సంస్థ, నాగ్‌పూర్ వారి సహకారంతో నిర్వహించబడుతున్న అధిక సాంద్రతలో పత్తి సాగు అనే ప్రాజెక్టులో భాగంగా శనివారం తలమడుగు మండలం పల్సి(కే) గ్రామంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ అధిక సాంద్రతలో పత్తి సాగు చేయడం వలన 1.5 నుంచి 2 క్వింటాళ్ల అధికంగా దిగుబడి వస్తుందన్నారు. అదేవిధంగా పత్తిలో ప్రధాన సమస్య అయిన గులాబీ రంగు పురుగు నివారణకు కూడా పంట మార్పిడి శనగ లేదా మక్క, జొన్న సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీవీ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, మోహన్‌దాస్, ప్రాజెక్టు ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.